క్లుప్తంగా

బదిలీ అయిన ఎంఐఎస్‌కు సన్మానం



పుష్పలతను సన్మానిస్తున్న ఎంఈవోలు రమణ, బాబూలాల్

పద్మనాభం: మండల విద్యాశాఖ కార్యాలయంలో మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్)గా పని చేసి, అనంతపురం జిల్లాకు బదిలీ అయిన పుష్పలతను బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంఈవోలు పి.రమణ, ఎస్‌డీ బాబూలాల్, ఉపాధ్యాయ సంఘ నాయకులు పుష్పలతను దుశ్శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎ.అరుణ్ కుమార్, బి.సూర్యనారాయణ , కె.సన్యాసిరావు, వి.గణేష్, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు ఇదదానరిపేటలో రూ.47.15 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జీవీఎంసీ వార్డుల్లో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. జెడ్పీటీసీ ఒమ్మి అయ్యప్పనాయుడు, కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గంలో పలువురికి చోటు

తగరపువలస: బీజేపీ జిల్లా కార్యవర్గంలో భీమిలికి చెందిన పలువురికి పదవులు లభించాయి. వీరిలో జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా శీరపు రామలక్ష్మి, గంధసిరి రాజన్న, సుబ్బరాజు నాగరాజు, అన్నదేవర సురేంద్రకుమార్, మీసాల రామునాయుడు ఉన్నారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా జేవీ కైలాస్‌రెడ్డి, కార్యదర్శిగా కంటబుక్త సునీత, కోశాధికారిగా ఉపాధ్యాయ శేషలత నియమితులయ్యారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తగరపువలస: ఆనందపురం గ్రామానికి చెందిన తుమ్మగంటి రామారావు కుటుంబ కలహాల కారణంగా సోమవారం ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. దీనిని గమనించిన అతని అన్నయ్య శ్రీను కేజీహెచ్‌లో చికిత్సకు తరలించగా మంగళవారం మృతి చెందాడు. కుటుంబ తగాదాల నేపథ్యంలో మద్యానికి బానిస అయిన రామారావు గడ్డి మందు తాగినట్టు శ్రీను ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఏఎస్‌ఐ బాలం నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిలిచిన మురుగు.. భక్తుల అవస్థలు



ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆనుకుని కాలువలో నిలిచిపోయిన మురుగునీరు

భీమునిపట్నం: భీమిలి పెద్దబజారు ప్రాంతంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద డ్రైనేజీలో మురుగునీరు నిలిచిపోవడంతో స్థానికులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ మెయిన్‌రోడ్డు దగ్గరలోని సుభాష్ రోడ్డులో ఆలయం వద్ద ఈ ప్రధాన కాలువ ఉంది. చుట్టుపక్కల ఉండే చిన్న కాలువల నుంచి నిత్యం నీరు పెద్ద ఎత్తున ఈ కాలువకు చేరుతుంది. గత నాలుగు రోజులుగా ఇక్కడ కాలువలో ఏదో అడ్డుపడడంతో, నీరు నిలిచిపోయి రోడ్డుపైకి వచ్చేస్తోంది. దీంతో ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో దుర్గంధం వెలువడడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాధులు కూడా వ్యాపించే అవకాశం ఉన్నందున అధికారులు స్పందించి, తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదర్శనగర్‌లో అడుగు పెట్టలేం..

- అధ్వానంగా పారిశుధ్యం
- అస్తవ్యస్తంగా డ్రైనేజీలు
- ఊరంతటికీ ఒకే ఒక్క పారిశుధ్య కార్మికుడు
- సమస్య రోజురోజుకూ తీవ్రం
- వర్షం వస్తే మరింత దారుణం



ఇళ్ల మధ్య మురుగులో పంది



అవుట్‌లెట్ లేక శివారులో నిలిచిన మురుగు

తగరపువలస: ఆదర్శనగర్‌లో అపారిశుధ్య తాండవిస్తోంది. జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట, నమ్మివానిపేట, సంగివలస గ్రామాల మధ్య మూడు దశాబ్దాల క్రితం వెలసిన ఈ గ్రామంలో సరైన డ్రైనేజీలు లేక ఈ పరిస్థితి నెలకొంది. ఎటు చూసినా ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీటి కుంటలు, అవుట్‌లెట్‌లు లేని కారణంగా బ్యాక్టీరియా పేరుకుపోతోంది. శుభ్రం చేయని డ్రైనేజీల నుంచి రెండు అంగుళాల కంటే పెద్ద సైజు గల పురుగులు నీళ్ల ట్యాంకులలోకి వచ్చి చేరుతున్నాయి. మురుగునీటి కుంటలను పందులు స్థావరాలుగా ఏర్పాటు చేసుకున్నాయి.

అవుట్‌లెట్లకు మార్గమేది?

ఆదర్శనగర్ 30 ఏళ్ల క్రితం అతిపెద్ద వ్యవసాయ క్షేత్రంగా ఉండేది. వందలాది మంది రైతులు మెట్ట పంటలు సాగు చేసుకునేవారు. రియల్ ఎస్టేట్ ప్రభావంతో బయటి నుంచి ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం వచ్చినవారి ప్రభావంతో వ్యవసాయ భూములు కాస్తా నివాస ప్రాంతాలుగా మారిపోయాయి. స్థలాలు కొనుక్కున్న వారు స్వార్థంతో రహదారి, డ్రైనేజీలకు మార్గాలు వదలకపోవడంతో ప్రస్తుతం ఈ గ్రామం అత్యంత ఇరుకుగా మారిపోయింది. స్థలాలు కొనుక్కున్నవారు ఖాళీగా వదిలేయడంతో తుప్పలు పెరిగి అడవిగా తయారైంది. భీమిలి మున్సిపాల్టీలో ఉన్నప్పటి నుంచి ఇప్పటి జీవీఎంసీ వరకు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఆదర్శనగర్‌కు వసతులు కల్పించడంలో విఫలం అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ సగానికిపై ఖాళీ ప్రదేశం ఉండిపోవడంతో డ్రైనేజీలు లేని చోట మిగిలినవారు వాడుకనీటిని అందులోకి వదులుతున్నారు. దీంతో పదుల సంఖ్యలో పందులు మురుగులోనూ, వందల సంఖ్యలో విషపురుగులు తుప్పలలోనూ కాపురాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఆదర్శనగర్ సచివాలయాన్ని ఆనుకుని జాతీయరహదారి వరకు టీచర్స్ కాలనీ, నమ్మివానిపేట వరకు పూర్తి స్థాయిలో డ్రైనేజీలు నిర్మించి అవుట్‌లెట్లను నమ్మివానిపేట రోడ్డులోని ఎర్ర కోనేరు, నల్ల కోనేరు మీదుగా చిట్టివలస పెద్ద చెరువులోని మళ్లించాలని ఆదర్శనగర్ గ్రామ ప్రజలు కోరుతున్నారు.



వానొస్తే చెరువే : డ్రైనేజీలు లేని ఆదర్శనగర్ ముఖద్వారం

పేరులోనే ఆదర్శం..

పేరులోనే ఆదర్శం కలిగిన ఈ గ్రామంలో వాస్తవ పరిస్థితులు చూస్తే ఎవరికైనా ఒళ్లు జలదరించకమానదు. అసంపూర్తిగా నిర్మించిన డ్రైనేజీలు నాచుకట్టి మురిగిపోయి వెదజల్లే దుర్గంధం ప్రతి వీధిలో కనిపిస్తుంది. ఈ గ్రామంలో ఖాళీ స్థలాలు, వాటిని ఆనుకుని నివాసాల మధ్య ముళ్లతుప్పలు పెరిగిపోయి చిన్న అడవిని తలపిస్తుంది. ఇది ఆదర్శనగర్ నుంచి టీచర్స్ కాలనీని ఆనుకుని జాతీయరహదారి వరకు ఇదే పరిస్థితి. డ్రైనేజీలు, వీధులు శుభ్రం చేయడం మొదలుకుని ఇంటింటా చెత్త సేకరణకు ఒకే పారిశుధ్య కార్మికుడు ఉండటంతో పారిశుధ్య సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని ఆదర్శనగర్ వాసులు వాపోతున్నారు.



అడ్డదిడ్డంగా డ్రైనేజీల నిర్మాణం



15 రోజులుగా శుభ్రం చేయకపోవడంతో బ్యాక్టీరియాతో నిండిపోయిన డ్రైనేజీ

డ్రైనేజీలు శుభ్రం చేసి 15 రోజులైంది



ఆదర్శనగర్‌లో మేము ఉండేచోట డ్రైనేజీలు శుభ్రం చేసి 15 రోజులు అవుతోంది. అడిగితే సిబ్బంది లేరు అంటున్నారు. వీధులు కూడా మురికి పట్టిపోయాయి. డ్రైనేజీలలో బ్యాక్టీరియా భయానకంగా ఉంది. ఇది వాటర్ ట్యాంకులోకి పాకుతూ చేరుతోంది. ప్రత్యేక డ్రైవ్ ద్వారా శుభ్రం చేయాలి. – **కోటమహంతి సత్యవతి**, ఆదర్శనగర్

ఇళ్ల మధ్యే వాడుకనీరు



ఆదర్శనగర్‌లో చాలాచోట్ల డ్రైనేజీలు లేవు. దీంతో వాడుక నీరు ఇళ్ల మధ్య ఉండిపోయి, అందులో దోమలు, పందులు తిష్ట వేస్తున్నాయి. ఈ కారణంగా మా ఇళ్లలో ప్రతిరోజూ ఎవరో ఒకరు వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. వర్షం వస్తే ఆదర్శనగర్‌లో ప్రతి వీధి ఒక చెరువులా కనిపిస్తుంది. – **వానపల్లి అచ్చియ్యమ్మ**, ఆదర్శనగర్

పారిశుధ్య సిబ్బందిని పెంచాలి



ఆదర్శనగర్‌లో సుమారు 500కు పైగా కుటుంబాల్లో 2వేల మందికి పైగా నివసిస్తున్నారు. ఇక్కడ పారిశుధ్య సిబ్బంది ఒక్కరే ఉంటున్నారు. డ్రైనేజీల శుభ్రత నుంచి చెత్త సేకరణ వరకు ఒక్కరే చేస్తున్నారు. దీంతో ప్రతి రోజూ ప్రతి వీధిలో శుభ్రత పనులు జరగడం లేదు. శాశ్వతంగా పారిశుధ్య సిబ్బందిని పెంచితే తప్ప ఆదర్శనగర్‌లో పరిశుభ్ర వాతావరణం ఏర్పడదు. – **రామోజు గంగ**, ఆదర్శనగర్

అమ్మకు మన'సారె'



సారెతో ఆలయానికి ఊరేగింపుగా వస్తున్న చిప్పాడ వాసులు



పండ్ల అలంకరణలో సుత్తమ్మ

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లికి పంచాయతీ వాసులు బుధవారం ఆషాఢసారె సమర్పించారు. వేకువజామున 4 గంటలకు వివిధ రకాల పండ్లతో అమ్మవారిని అలంకరించారు. షోడశోపచార పూజ, లలితా సహస్రనామాలతో కుంకుమ పూజ చేశారు. విశిష్ట, ఏక, పంచ, నవ, నక్షత్ర, కుంభ, మంగళ హారతులు ఇచ్చిన అనంతరం భక్తులకు ఉదయం 6 గంటల నుంచి దర్శనాలు కల్పించారు. 8 గంటలకు కోలాటం, బాణసంచా, డప్పులు, శరణు ఘోషలతో ప్రారంభమైన సారె ఊరేగింపు ఆలయానికి 11 గంటలకు చేరుకుంది. వందలాది మంది మహిళలు కలశాలు, స్వీట్లు, పండ్లు తలపై పెట్టుకుని వచ్చారు. అమ్మవారికి సారె సమర్పణ అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

మహిళలపై పెరుగుతున్న దాడులు

ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ



కొత్తగా ఎన్నికైన కమిటీతో నాయకులు

మధురవాడ: మహిళలపై రోజురోజుకూ పెరుగుతున్న హింస, దాడులు, వేధింపుల నుంచి రక్షించుకునేందుకు ఉద్యమించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి అన్నారు. హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. కొమ్మాది జంక్షన్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన ఐద్వా మద్దిలపాలెం జోన్ 5వ మహాసభల్లో వారు మాట్లాడారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీకే రుణాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆ హామీని తుంగలోకి తొక్కిందన్నారు. మహిళల రక్షణే తమ ధ్యేయం అని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను నేరస్తులకు చుట్టాలుగానే మార్చేస్తున్నాయన్నారు. కెప్టెన్ లక్ష్మీ సెహగల్ వర్ధంతి సందర్భంగా ముందుగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు.

నూతన కమిటీ ఎన్నిక

మధురవాడ, ఆరిలోవ, మద్దిలపాలెం కమిటీలను కలిపి మద్దిలపాలెం జోన్‌గా ఏర్పాటు చేసి, నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బి.భారతి, కార్యదర్శిగా కొండమ్మ, కోశాధికారిగా వి.శాంతి, ఉపాధ్యక్షులుగా కె.కుమారి, ఎస్.గౌరి, సహాయ కార్యదర్శులుగా కె. సుజాత, ఎం.మౌనికను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలిగా లక్ష్మి



తగరపువలస: వైఎస్సార్‌సీపీ ఆనందపురం మండల మహిళా అధ్యక్షురాలిగా ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు బాకూరుపాలెంలో మంగళవారం జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ప్రకటించారు. గతంలో రెండుసార్లు ఈ పదవి చేపట్టిన లక్ష్మి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మారోమారు బాధ్యతలు అప్పగించినందుకు పార్టీకి రుణపడి ఉంటామన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా పార్టీ గెలుపుకోసం తనవంతు కృషి చేస్తానన్నారు. వైఎస్ జగన్‌తో మాత్రమే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. జగనన్న సంక్షేమ పరిపాలనకు రాష్ట్రం మరోమారు ఎదురు చూస్తోందన్నారు.

ప్రశ్నార్థకంగా 2వ తరగతి విద్యార్థి భవిత

స్పందించని విద్యాశాఖ



ఉత్తేజ్ ఒకటో తరగతి పాస్ అయినట్లు ఇచ్చిన రికార్డు షీట్

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీలోని రవీంద్రభారతి స్కూల్ నిర్వాకం.. ఆ మండలానికి చెందిన ఇద్దరు ఎంఈవోల నిర్లక్ష్యం కారణంగా రెండో తరగతిలో ఉండవలసిన విద్యార్థి ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. వివరాలివి.. పద్మనాభం మండలం రేవిడి పంచాయతీ రౌతులపాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు ఆదినారాయణ, తన కుమారుడు మోపాడ ఉత్తేజ్‌ను 2024 జూన్‌లో రవీంద్రభారతి పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్పించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో అనగా గత విద్యాసంవత్సరమే స్కూల్ నుంచి ఒకటో తరగతి పాసైనట్టు రికార్డు షీట్ కూడా తీసుకుని రౌతులపాలెం ఎంపీపీ పాఠశాలలో చేర్పించారు. రవీంద్ర భారతి యాజమాన్యం రికార్డుషీట్ ఇచ్చినా, డ్రాప్ బాక్స్‌లో విద్యార్థి పేరు చేర్చనందున రౌతులపాలెం పాఠశాలలో కొనసాగలేక పోతున్నాడు. పైగా రవీంద్ర భారతి పాఠశాల ఉత్తేజ్ పేరును ఆన్‌లైన్‌లో తొలగించకుండా, యూకేజీలో చూపిస్తోంది. దీనిపై ఆనందపురం ఎంఈవోలు గంగరాజు, జోగేంద్రల దృష్టికి తీసుకువెళ్లి మూడు రోజులు గడిచినా స్పందించలేదు. దీంతో ఉత్తేజ్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: 33/11 కేవీ ఆనందపురం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ పెద్దిపాలెం, గంభీరం ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా మెట్టమీదపాలెం, పాలవలస, పాడుగుపాలెం, చందక, వెంకటాపురం, జగన్నాథపురం, గొట్టిపల్లి, కుసులవాడ, చీమలమెట్ట పాలెం గ్రామాల్లో గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

భీమిలి మండలంలో..

భీమిలి మండలం అన్నవరం, దాకమర్రి ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ కారణంగా మండలంలోని అన్నవరం, కంచేరుపాలెం, పెదనాగమయ్యపాలెం, చిననాగమయ్యపాలెం, ఎర్రయ్యపాలెం,ఆశిపాలెం, ఎన్టీఆర్ కాలనీ, దివీస్ పంప్‌హౌస్, జీవీఎంసీ పంప్‌హౌస్, అవంతి విద్యాసంస్థలు, టి.నగరపాలెం హైవే, జాతీయరహదారి, ఉత్కర్ష లే అవుట్, ఒక్రిడ్జ్ విద్యాసంస్థల పరిసరాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అధికారులు తెలిపారు.

తాళ్లవలస సబ్‌స్టేషన్ పరిధిలో..

భీమిలి మండలం 33/11 కేవీ తాళ్లవలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రూరల్ ఫీడర్లపై నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని అధికారులు తెలిపారు. ఈ కారణంగా తాళ్లవలస, రాయినపేట, ఎరుసుపేట, లెజెండ్ లే అవుట్, వసుము పేట, హాసిని లే అవుట్, హార్మొని లే అవుట్, మహిత లే అవుట్, సంగివలస డబుల్‌రోడ్డు, యాతపేట, చిన్నిపేట, తిరుమల కళాశాల రోడ్డు, గొల్లల తాళ్లవలస ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నవోదయ ఫీడర్ పరిధిలో..

మధురవాడ: కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ నవోదయ 11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి. సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా కొమ్మాది జంక్షన్, వైభవ్‌నగర్, ప్రశాంతినగర్, వసంత్ విహార్, టీచర్ లే అవుట్, విజయం స్కూల్, రిక్షా కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ధర్మపురి ఫీడర్ పరిధిలో..

పీఎం పాలెం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ 11 కేవీ ధర్మపురి ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని జోన్-3 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా సూర్యశక్తి నగర్, ధర్మపురికాలనీ, బింద్రానగర్, పిలకవానిపాలెం, షిప్‌యార్డు లేఔట్, ఎంవీవీ సిటీ రోడ్ ఏరియా, ఎంజీఆర్ లేఔట్, మిధిలాపురి వుడాకాలనీ మెయిన్ రోడ్ ఏరియాలకు సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

పేదలపైనే అధికారుల ప్రతాపం

- బడాబాబులు కబ్జాలు చేసినా కన్నెత్తి చూడని వైనం
- వారికో న్యాయం.. వీరికో న్యాయమా?



షెల్టర్ ధ్వంసం చేయడంతో రోడ్డున పడ్డ కుమారి తల్లిదండ్రులు, సోదరుడు



రెవెన్యూ అధికారులు ధ్వంసం చేసిన కుమారి షెడ్డు

తగరపువలస: ఆనందపురం మండల రెవెన్యూ అధికారుల వ్యవహారశైలి కాకులను కొట్టి గద్దలకు వేసినట్టుగా ఉంది. గండిగుండం పంచాయతీకి చెందిన సియాద్రి కుమారి భర్త ఎర్రినాయుడు నాలుగేళ్ల క్రితం మరణించాడు. దీంతో ఆమె పంచాయతీలోనే కోరమాండల్ పెయింట్స్ రోడ్డులో చిన్న షెడ్డు వేసుకుని ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం విక్రయించుకుని ఇద్దరు కుమారులను పోషించుకుంటోంది. బోదకాలు కారణంగా నడవలేని తల్లి ముమ్మన మావూళ్లమ్మ, కాలు తీసేసిన తండ్రి దేవుడు, కిడ్నీ వ్యాధి కారణంగా ఏ పనీ చేయలేని సోదరుడు సతీష్‌ల పోషణ, వైద్య భారం కూడా ఈమెపైనే ఉంది. సొంత ఇల్లు లేని ఈమె రూ.2వేల అద్దె ఇంట్లో వీరందరితో నెట్టుకొస్తోంది. వాహనాల రాకపోకలకు ఏ మాత్రం ఆటంకం కలగని విధంగా సర్వీస్‌రోడ్డుకు దూరంగా షెడ్డు వేసుకుని ఈ హోటల్ నడుపుతోంది. కూటమి నాయకుల ప్రోద్బలంతో వీఆర్వో దేవరాజ్ తదితరులు మంగళవారం మధ్యాహ్నం అక్కడికి చేరుకుని భోజనం చేస్తున్న వారిని గద్దించి వెళ్లగొట్టారు. సర్పంచ్ గంర్రెడ్డి శ్రీనివాస్ గడువు కోరినా అవకాశం ఇవ్వలేదు. మిగిలిపోయిన ఆహార పదార్థాలు, ఉపాధి ఇచ్చే గూడు కూలిపోవడంతో కుమారి సోదరుడు, తల్లిదండ్రులతో రోడ్డున పడింది. పేదలపై ప్రతాపం చూపిన రెవెన్యూ అధికారులు మండలంలో బడానేతలు, కూటమి నాయకులు రూ.కోట్ల విలువైన భూములు కబ్జా చేసినా కన్నెత్తి చూడటం లేదు. మండలంలో పెందుర్తి, విశాఖ రహదారిలో ఇరువైపులా రహదారులను ఆక్రమించిన వ్యాపారుల జోలికి ఎందుకు పోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వీటిపై ఎందుకు స్పందించరు?

కలెక్టర్, తహసీల్దార్లకు ఫిర్యాదులు అందినా స్పందించని కబ్జాల వివరాలివీ..

- గంభీరం పంచాయతీలోని సర్వే నంబర్ 173లో ఆక్రమణలుగా తేల్చి గత ఫిబ్రవరిలో షెడ్లు కూల్చివేయగా మళ్లీ యథేచ్ఛగా ఇప్పుడు షెడ్లు నిర్మించి గేట్లు పెట్టారు. కానీ వాటి జోలికి వెళ్లలేదు.
- గిడిజాల పంచాయతీ దిబ్బడిపాలెంలో సర్వే నంబర్ 310/5, 311/14లో రూ.40 కోట్ల విలువైన 4 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది.
- అదే గ్రామంలో సర్వే నంబర్ 258లో రూ.25 కోట్ల విలువైన రెండు ఎకరాలు కబ్జాదారుల హస్తాల్లోకి వెళ్లనుంది.
- శొంఠ్యాం పంచాయితీలో ఆక్రమణలు, గంభీరం పంచాయతీలో సర్వే నంబర్ 127/5లో 15 సెంట్లు భూమిని ఇటీవల టీడీపీ నాయకులు కబ్జా చేయడంతో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది.

కూటమి వైఫల్యాలపై రేపటి నుంచి ఇంటింటి ప్రచారం

తగరపువలస: కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై భీమిలి మండలంలో ఈ నెల 25 నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రజలను వ్యక్తిగతంగా కలిసి 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ'పై కూటమి ప్రభుత్వం ఇచ్చిన నెరవేర్చని హామీలపై అప్రమత్తం చేయనున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అక్కడి ప్రజలను కలవనున్నారు. ఇందులో భాగంగా 25న అన్నవరం, 26న మజ్జివలస, 27న లక్ష్మీపురం, 28న అమనాం, 29న శింగనబంద, 30న టి.నగరపాలెం, ఆగస్టు 1న మజ్జిపేట, 2న పెదనాగమయ్యపాలెంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయి. ఆగస్టు 3 నుంచి ఆనందపురం మండలంలో కార్యక్రమాలు కొనసాగుతాయి.

భీమిలి ప్రభుత్వ ఖాజీగా షేక్ షరీఫ్ నియామకం



తగరపువలస: భీమిలి నియోజకవర్గ ప్రభుత్వ ఖాజీగా పీఎం పాలెంలోని ఉస్మాన్ కాలనీకి చెందిన షేక్ షరీఫ్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కలెక్టర్ ప్రతిపాదన మేరకు మైనారిటీ సంక్షేమ విభాగం నుంచి ప్రభుత్వ కార్యదర్శి చిట్టూరి శ్రీధర్ వీటిని జారీ చేశారు. ముస్లిం సమాజంలో వివాహాల నిర్వహణకు గాను కొన్ని షరతులకు లోబడి పదేళ్ల పాటు ఈయన ఖాజీగా విధులు నిర్వర్తిస్తుంటారు. ఇస్లామిక్ సంప్రదాయ కోర్సులైన హఫీజ్, ఆలిమ్, ఫాజి, ముఫ్తిలను పూర్తి చేసిన షరీఫ్ 2022 నుండి కొమ్మాది కూడలిలోని మసీదు ఇ ముజమ్మిల్‌లో ఇమామ్‌గా పని చేస్తున్నారు. ఖాజీ తన చర్యలకు ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలి. ఖాజీ గరిష్ఠంగా ముగ్గురు నాయక్ ఖాజీలను నియమించుకుని, వారి పేర్లను ప్రభుత్వానికి తెలియచేయాలి.

బ్యాంక్ లాకర్లకు భద్రమైన ప్రత్యామ్నాయం 'ఆరం'



ఆరం లాకర్

కొమ్మాది: బ్యాంక్ లాకర్లకు భద్రమైన ప్రత్యామ్నాయంగా ఆరం సేవలకు విశాఖలో మంచి స్పందన లభిస్తోందని సంస్థ సీఈవో ఆరిశెట్టి విజయ్ అన్నారు. మధురవాడలో ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రీమియర్ సేఫ్ డిపాజిట్ లాకర్ సంస్థ ఆరం విశాఖలో పలువురి మన్ననలు అందుకుంటోందన్నారు. నెలరోజుల క్రితం నగరంలోని మూడు ప్రదేశాల్లో 2 వేల లాకర్లు ఏర్పాటు చేశామని, ఈ ఏడాది చివరకు 5వేల లాకర్లు లక్ష్యంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలు, రియల్టీ డెవలపర్లు, కమర్షియల్ స్పేస్‌లు తమ భద్రతను పెంపొందించే దిశగా ఆరం సాంకేతికతతో కూడిన సేఫ్ డిపాజిట్ సొల్యూషన్‌కు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. హోం, బ్యాంక్ లాకర్లకు ప్రత్యామ్నాయంగా బయోమెట్రిక్ ప్రమాణీకరణ యాక్సెస్, మిలిటరీ స్థాయి భద్రత, రూ.కోటి వరకు బీమా భద్రత, మొబైల్ యాప్ ద్వారా సులభమైన ఆన్‌బోర్డింగ్ కల్పిస్తున్నామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో నెల్లిమర్ల వాసి మృతి



మృతుడు అప్పారావు

తగరపువలస: జాతీయ రహదారిపై ఆనందపురం మండలం పెద్దిపాలెం వద్ద మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో రోడ్డు దాటుతున్న సప్పిడి అప్పారావు(40) అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా రాత్రి 11.30 సమయంలో మరణించాడు. మృతుడిది విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం రామతీర్థాలు జంక్షన్.మృతుడి చిన్నాన్న కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు.